www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 11 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోనుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-123 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లలిత్

అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం● 27న సుప్రీం సిజెగా ప్రమాణ స్వీకారం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 (సమ సమాజం):** భారత తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎవరన్న దానిపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. సుప్రీంకోర్టు 49వ సీజేగా జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. సుప్రీంకోర్టు 49వ భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉదయ్ ఉమేష్ లలిత్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారంనాడు నియమించారు. ఈ ఆగస్టు 27వ తేదీ నుంచి ఆయన నియామకం అమలులోకి వస్తుంది. కొత్త సీజేఐ పేరును సిఫారసు చేయాలని కోరుతూ ఆగస్టు 3వ తేదీన కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు సీజేఐ సెక్రటేరియట్‌కు లేఖ పంపారు. ఆ మరుసటి రోజే సీజేఐ ఎన్.వి.రమణ సుప్రీంకోర్టులో సెకెండ్ సీనియర్ మోస్ట్ జడ్జి అయిన యూయూ లలిత్ పేరును సిఫారసు చేసారు. ఈనెల 26వ తేదీతో సీజేఐ ఎన్వీ రమణ పదవీ కాలం ముగుస్తోంది. అయితే సీజేఐ లలిత్ పదవీ విరమణ వ్యవధి కూడా మూడు నెలల కంటే తక్కువగా ఉంది. 2022 నవంబర్ 8న ఆయన రిటైర్ కావాల్సి ఉంది. 2014, ఆగస్టు 13న సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పదోన్నతి పొందారు. దీనికి ముందు సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్‌గా ఆయన ఉన్నారు. యూయూ లలిత్ తండ్రి యూఆర్ లలిత్ సైతం సీనియర్ అడ్వకేట్. ముంబై హైకోర్టు అడిషనల్ జడ్జిగా ఉన్నారు. ఆయన పేరును ప్రస్తుత సీజేఐ ఎన్వీ రమణ ప్రతిపాదించారు. దీనికి సంబంధించిన లేఖను సీజేఐ కేంద్ర న్యాయ శాఖకు పంపగా.. అక్కడి నుంచి దాన్ని ప్రధాని కార్యాలయానికి పంపారు. పీఎం మోదీ ఆమోదం తర్వాత రాష్ట్రపతి పేషీకి వెళ్లింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 49వ సీజేఐగా ఉదయ్ ఉమేష్ లలిత్ నియామకానికి అనుమతి ఇవ్వడంతో కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ఈ నెల 26న పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో 27న ఉదయ్ ఉమేష్ లలిత్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. జస్టిస్ లలిత్ పదవీ కాలం కేవలం మూడు నెలలు మాత్రమే ఉంది. నవంబర్ 8న ఆయన పదవీవిరమణ కానున్నారు. 1957 నవంబర్ 9న జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్ జన్మించారు. 1983 జూన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 1985 డిసెంబర్ వరకు బొంబాయి హైకోర్టులో పనిచేసిన ఆయన.. 1986 జనవరి నుంచి సుప్రీంకోర్టులో ప్రాక్టీసు మొదలు పెట్టారు. 2014 ఆగస్టు 13న యూయూ లలిత్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి అనేక కీలక తీర్పులు ఇచ్చారు. దేశంలోనే తీవ్ర సంచలనం సృష్టించిన త్రిపుల్ తలాక్‌తోపాటు అనేక కీలక తీర్పుల్లో ఆయన భాగస్వామిగా ఉన్నారు.

# నిజాయితీ, నిబద్ధ రాజకీయాలకు నిలవుటద్దం

- ➢రాజకీయాల్లో స్వశక్తితో ఎదిగిన నేత వెంకయ్య
- ➢ఆయన లేని బిజెపిని ఊహించుకోవడం కష్టమే
- ➢పార్లమెంటులోనూ ఆయన లోటు పూడ్చడం కష్టమే
- ➢ఉపరాష్ట్రపతిగా ముగిసిన వెంకయ్య పదవీకాలం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 (సమ సమాజం):** నిబద్ధ రాజకీయాలకు రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పెట్టింది పేరు. ఆయన రాజకీయాల్లో ఉన్నత విలువలు పాటించారు. ఈ కాలంలోనూ ఇంకా నిజాయితీ రాజకీయాలు కొనసాగించడం ఆయనకు మాత్రమే సాధ్యం అయ్యింది. వాజ్‌పేయ్, అద్వానీ, మురళీ మనోహర్ జోషి లాంటి ఉద్దండులతో కలసి పనిచేయడం ద్వారా ఆయన తన రాజకీయ జీవితాన్ని మెరుగు పరచుకున్నరే తప్ప మురుగు అంటనీయలేదు. రాజకీయాల్లో ఏనాడూ పదవుల కోసం వెంపర్లాడలేదు. అందుకే దేవుడి తరవాత తనకు వాజ్‌పేయ్, అద్వానీ అంతటి వారని నిర్మొహమాటంగానే చెప్పారు. నిజానికి మోడీ ఈ మాట అనాలి కానీ అలా అనడం లేదు. అయితే బిజెపి రాజకీయాల నుంచి వెంకయ్యను తప్పించాలన్న పెద్ద కుట్రలో భాగంగానే ఆయన ఉపరాష్ట్రపతిని చేసి ఐదేళ్లుగా పార్టీకి దూరం చేశారు. నిజానికి మోడీ కుత్సిత రాజకీయాలకు ఓ రకంగా అద్వానీ,మురళీమనోహర్ జోషిలు బలయ్యారు. వెంకయ్యకు పదవి కట్టబెట్టి బలిచేశారు. అందుకే ఆయన బుధవారంతో పదవీవిరమణ చేస్తున్నారంటే అందరికంటే ఎక్కువగా బిజెపిలోని నిజాయితీ రాజకీయ నేతలే ఎక్కువగా బాధపడుతున్నారు. ఉమ్మడి ఎపిలో పార్టీ అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ అధ్యక్షుడిగా అధికార ప్రతినిధిగా, రాజ్యసభ సభ్యుడుగా, కేంద్ర మంత్రిగా, ఉప రాష్ట్రపతిగా ఆయన ఏ పదవిలో ఉన్నా నిబద్ధ రాజకీయాలకు మాత్రమే కట్టుబడి పనిచేశారు. ఆయనకు సన్నిహితంగా మెలిగిన వారికి ఈ విషయం మరింతగా అర్థం అవుతుంది. బిజెపి నేతల్లో

2వ

# బీహార్‌లో కొలువుదీరిన మహాఘట్‌బంధన్

సిఎంగా నితీశ్ కుమార్, డిప్యూటీగా తేజస్వీ యాదవ్



**పాట్నా, ఆగస్ట్ 10 (సమ సమాజం):** బీహార్‌లో 'మహా ఘట్‌బంధన్' ప్రభుత్వం కొలువుతీరింది. మధ్యాహ్నం 2 గంటలకు రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్, ఉపముఖ్యమంత్రిగా తేజస్వి యాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ ఫగు చౌహాన్ వీరిచేత ప్రమాణస్వీకారం చేయించారు. మంత్రులను తదుపరి క్రమంలో నితీష్ తన క్యాబినెట్‌లోకి తీసుకోనున్నారు. ప్రమాణస్వీకారం అనంతరం తేజస్వికి నితీష్ అభినందనలు చెప్పారు. నితీష్ పాదాలకు తేజస్వి నమస్కరించే ప్రయత్నం చేయడంతో ఆయన వారించి నవ్వుతూ కరచాలనం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీదేవి, మహా కూటమి నేతలు హాజరయ్యారు. బీహార్ సీఎంగా నితీష్ పగ్గాలు చేపట్టడం ఇది ఎనిమిదో సారి. బిజెపితో తెగదెంపులు చేసుకున్న నితీశ్ ఆర్జెడితో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. బీహార్ అసెంబ్లీలో 243 మంది సభ్యులుండగా, జేడీయూకు 43, ఆర్జేడీ 79, సీపీఐ (ఎంఎల్)కు 12, సీపీఐ, సీపీఎంలకు చెరో ఇద్దరు ఎమ్మెల్యేల బలం ఉంది. బీజేపీకి 77

2వ

# ప్రియాంకకు కరోనా పాజిటివ్

- అస్వస్థతతో ఇంటికే పరిమితమైన రాహుల్
- పలువురు కాంగ్రెస్ నేతలకు కూడా కోవిడ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 (సమ సమాజం):** కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి కరోనా పాజిటివ్ గా నిర్ధారణ అయింది. ఈవిషయాన్ని స్వయంగా ఆమె ట్విట్టర్ ఖాతాలో ప్రకటించారు. గతంలోనూ ఒకసారి ప్రియాంక గాంధీ కోవిడ్ బారిన పడ్డారు. ఆమెకు కరోనా పాజిటివ్ రావడం ఇది రెండోసారి. తాను ఐసోలేషన్ లో ఉన్నానని, కోవిడ్ ప్రొటోకాల్ ను పాటిస్తున్నానంటూ ట్వీట్ చేశారు. యరోవైపు ఆమె సోదరుడు,కాంగ్రెస్ నేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ అస్వస్థతకు గురయ్యారు. దీంతో రాజస్థాన్ లోని అల్వార్ పర్యటన రద్దయింది. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సంకల్ప్ శిబిరంలో పాల్గొనాల్సి ఉంది. పార్టీ బలోపేతానికి ఇటీవల కాంగ్రెస్ పార్టీ అన్ని రాష్ట్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న అధికారాన్ని నిలబెట్టకునేందుకు ఇప్పటి నుంచే కాంగ్రెస్ అధిష్టానం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా రాజస్థాన్ పై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ఈఏడాది మేలో

2వ

# పుల్వామాలో మరోమారు భారీ ఉగ్రకుట్ర

30కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం, ధ్వంసం ■ కాశ్మీర్‌లో కొనసాగిన ఎన్‌కౌంటర్



**శ్రీనగర్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** స్వాతంత్ర్య వజ్రోత్సవాల వేళ జమ్ము కశ్మీర్‌లో భారీ ఉగ్రకుట్రను బలగాలు భగ్నం చేశాయి. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు 30 కేజీల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు, కశ్మీర్‌లో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ముగ్గురు ముష్కరులను బలగాలు చుట్టుముట్టాయి. పుల్వామాలోని తహాబ్ క్రాసింగ్ వద్ద 25-30 కేజీల ఐఈడీని రికవరీ చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. దీంతో భారీ ఉగ్రముప్పు తప్పినట్లైంది.పుల్వామా పోలీసులు, భద్రతా దళాలకు ఐఈడీ రవాణా గురించి పక్కా సమాచారం అందింది. తహాబ్ క్రాసింగ్ వద్ద 25 నుంచి 30 కిలోల ఐఈడీని స్వాధీనం చేసుకున్నాం' అని కశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ వెల్లడించారు. దీనికితోడు కశ్మీర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు అధికారులు. రైల్వే స్టేషన్లలో నిఘా పెట్టారు. స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో అదనపు బలగాలను రంగంలోకి దించారు. ఉధంపూర్-కాట్రా రైల్వే లింక్ వద్ద భారీగా బలగాలు మోహరించారు. స్పెషల్ డాగ్ స్క్వాడ్, రైల్వే భద్రతా దళం స్టేషన్ల పరిసరాల్లో నిరంతరం గస్తీ కాస్తున్నాయి. ప్రయాణికులను, వారి సామగ్రిని ముమ్మరంగా తనిఖీ చేస్తున్నాయి. మరోవైపు, బుద్గాంలో పోలీసులకు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. వాటర్‌హిల్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ముగ్గురు ముష్కరులను భద్రతా దళాలు చుట్టుముట్టాయని తెలిపారు. ది రెసిస్టెన్స్ ఫ్రంట్, లష్కరే తొయిబా ముఠాకు చెందినవారిగా భావిస్తున్న వీరిని బలగాలు నిలువరించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

2వ

# మునుగోడులో టిఆర్ఎస్‌దే గెలుపు

- అక్కడ గెలిచి తీరుతామని ధీమా
- స్కౌట్స్ వజ్రోత్సవాల్లో మొక్కలు నాటిన కవిత



**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** మునుగోడులో టిఆర్ఎస్ గెలుస్తుందని, అక్కడ టిఆర్ఎస బలంగా ఉందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రస్తుతం అక్కడ బిజెపి కుళ్లు రాజకీయాలు నడుస్తున్నాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మునుగోడు టీఆర్ఎస్ కంచుకోట అని..ఉపఎన్నికలో టీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. స్వాతంత్య వజ్రోత్సవాలలో భాగంగా దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్‌లో వనమహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హుజుర్ నగర్, నాగార్జున సాగర్ లాగే మునుగోడులో టీఆర్ఎస్ జెండా ఎగురుతుందన్నారు. కరోనా సంక్షోభంలోనూ సంక్షేమ పథకాలు ఆపలేదని..ప్రజాసంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ బ్యాక్?డోర్ పాలిటిక్స్ మానుకోవాలని

2వ

# మునుగోడులో ఎగిరేది కాషాయ జెండానే

కెసిఆర్ అసమర్థ పాలనతో ప్రజలు విసిగారు: దాసోజు



**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమే అని ఇటీవలే పార్టీలో చేరిన నేత దాసోజు శ్రవణ్ అన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల అభిమానం పొందుతోందని చెప్పారు. బీజేపీలో చేరిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ఆయనకు శంషాబాద్ ఎయిర్ పోర్టులో బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. కేసీఆర్ నియంతృత్వ ధోరణితోనే కాళేశ్వరం, మేడిపల్లి నీట మునిగిందని..లక్షా యాభై వేల కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ అనాలోచితంగా నీటిపాలు చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ముంపుపై కనీసం రివ్యూ చేయకపోవడం దుర్మార్గమన్నారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ కేంద్రంపై అనవసర విమర్శలు చేస్తున్నారని శ్రవణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రజలు కుటుంబ పాలనకు చరమగీతం పాడి బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. మునుగోడులో కాషాయ జెండా ఎగరడం ఖాయమని దీమా

2వ

## సంపాదకీయం

# బిజెపికి బీహార్ గుణపాఠం కావాలి !

డబుల్ ఇంజన్ సర్కారు నినాదంతో.. అప్రతిహతంగా జైత్రయాత్ర చేస్తూ.. ఒక్కో రాష్ట్రాన్ని తన ఖాతాలో వేసుకుంటున్న భారతీయ జనతా పార్టీకి బిహార్‌లో ఎదురుదెబ్బ తగిలింది..! ఆ రాష్ట్రం కమలదళం నుంచి చేజారిపోయింది. ఇంతకాలం ఎన్డీయే సర్కారును నడిపిన జనతాదళ్(యునైటెడ్) నేత నితీశ్ కుమార్.. ఏకంగా బిజెపినే దెబ్బకొట్టారు. అన్ని రాష్ట్రాల్లో బిజెపి దెబ్బ కొడుతూ వస్తుండగా బీహార్‌లో మాత్రం సీన్ రివర్స్ అయ్యింది. ఇది బిజెపికి గుణపాఠం కావాలి. కేవలం అధికారాన్ని హస్తగతం చేసుకోవడం ..డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ ఊదరగొట్టడం మినహా ప్రజలకు ఒరిగిందేమీ ఉండదవ లేదని బీహార్ నిరూపిం చింది. బహుశా కారాణాలు వేరైనా..బిజెపితో అంటకాగడం వల్ల బీహార్‌లో నితీశ్ సర్కార్‌కు అదనంగా ఒరిగిం దేమీ లేదని కూడా తెలుసుకోవాలి. నిజంగానే బీహార్‌లో బిజెపితో కలసి ఉన్నందువల్ల ప్రయోజనాలు జరిగి వుంటే నితీశ్ ఎదురుతిరిగే వారుకాదు. ఆర్జెడిని తిరిగి దరిచేర్చుకునే వారు కాదు.మొత్తంగా ఒక్కో రాష్ట్రాన్ని అనకొండలా మిగడం తప్ప దేశంలో ఒనగూరే ప్రయోనాలు శూన్యం. విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం లో..ప్రజలకు అండగా నిలవడంలో బిజెపి ఘోరంగా వైఫల్యం చెందింది. అందుకే బీహార్‌లో బిజెపితో కలిసున్నా....ఆర్జెడితో జతకట్టినా నితీశ్ ప్రభుత్వానికి ఒరిగేదేమీ లేదు. ఓ రకంగా చెప్పాలంటే బీజేపీకి బిహార్‌లో షాక్ తగిలిందనే చెప్పాలి. ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేసి.. విపక్ష ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో సర్కారు ఏర్పాటుకు సిద్ధం కావడం అన్నది బిజెపికి రివర్స్ అటాక్ ఇచ్చినట్లు అయ్యింది. నెల క్రితం బిహార్ సంకీర్ణ ప్రభుత్వంలో మొదలైన ముసలం..ఇప్పుడు తారాస్థాయికి చేరుకుంది. ఇకపోతే ప్రస్తుత పరిణామా లకు బీజేపీ స్వయంకృతాపరాధమే తసకస మరోటి కాదు. ప్రాంతీయ పార్టీలను ఉనికి లేకుండా చేస్తామన్న బిజెపి అధ్యక్షుడు నడ్డా అహంకారానికి ఇది ఓ జవాబుగా చూడాలి. జనతాదళ్ (యునైటెడ్) జాతీయ మాజీ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి ఆర్సీపీ సింగ్ పార్టీకి రాజీనామా చేయడంతో బీజేపీ-జేడీయూ బంధంలో బీటలు మరింత తేలతెల్లమయ్యాయి. నిజానికి ఆయనను కేంద్ర మంత్రిగా బీజేపీ ఏకపక్షంగా ఎంపిక చేసింది. ఆయన అమిత్‌షాకు దగ్గరవుతున్నట్లు గుర్తించిన నితీశ్..ఈసారి రాజ్యసభ సభ్యత్వాన్ని పునరుద్ధ రించలేదు. ముందు నుంచీ.. కేంద్ర సర్కారులో రెండు బెర్తులు కావాలని నితీశ్ కోరినా.. బీజేపీ పట్టించు కోవడం లేదు. దాంతో.. లోక్‌జనశక్తి మాదిరిగా.. ఆర్సీపీ సింగ్ ద్వారా జేడీయూ ను చీల్చేందుకు బీజేపీ కుట్రపన్నుతోందని నితీశ్ గుర్తించారు. బిహార్‌పై పట్టుకు షా ప్రయత్నిస్తుం డడంతో.. ఆర్సీపీ సింగ్ మరో ఏక్‌నాథ్ షిండేలా మారినా ఆశ్చర్యపోనక్కర్లేదని జేడీయూ చీఫ్ భావించారు. మరోవైపు.. మిత్రపక్షమే అయినా, రాష్ట్ర బీజేపీ నేతలు అడపాదడపా తనను టార్గెట్ చేయడం, ఇరకాటంలో పడేస్తుండడం నితీశ్‌కు కొత్త చికాకులు తెచ్చిపెడుతున్నాయి. దీంతో.. తెగదెంపులకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే నితీశ్ సుమారు నెలరోజులుగా బీజేపీతో దూరంగా ఉంటున్నారు. ఆదివారం ప్రధాని అధ్యక్షతన జరిగిన నీతిఆయోగ్ సమావేశానికి, గత నెల 17న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అమిత్‌షా నిర్వహించి న సమావేశానికి, రాష్ట్రపతి పదవి నుంచి దిగిపోతున్న సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి, గత నెల 25న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారానికి నితీశ్ హాజరు కాకపోవడంలో ఆయన దూరంమవుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. బీజేపీకి వ్యతిరేకంగా 2013లో ఏర్పాటైన మహా గఠ్‌బంధన్‌ను పునరుద్ధరించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బిజెపి కుటిల రాజకీయాలకు నితీశ్ సవాల్ విసిరారనే చెప్పాలి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ జేడీయూ - బీజేపీ కూటమి విజయం సాధించింది. జేడీయూకు తక్కువ మెజారిటీ ఉన్నా.. నితీశ్‌కే సీఎంగా అవకాశం దక్కింది. అయితే.. బీజేపీ ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తోందని, తన సర్కారును రిమోట్ కంట్రోల్‌లా మార్చాలని చూస్తోందని నితీశ్ ఇంతకాలం లోలోపల రగిలిపోతూ వచ్చిన నితీశ్ సమయంచూసి బిజెపికి రామ్‌రామ్చెప్పాలి.బీజేపీకి గుడ్‌బై చెప్పి.. మళ్లీ పాతకూటమితో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తన ఆత్మగౌరావాన్ని నిలబెట్టుకున్నారు. అయితే జేడీయూది వెన్నుపోటు రాజకీయాలని బీజేపీ ఆరోపించింది. తాజా పరిణామాలపై బీజేపీ బిహార్ అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్ తీవ్రంగా స్పందించారు. 2020 ఎన్నికల్లో తక్కువ సీట్లు వచ్చినా.. నితీశ్ పార్టీకి అధికారాన్ని కట్టబెడితే.. ఇప్పుడు వెన్నుపోటు పొడిచా రంటూ మండిపడ్డారు. ప్రస్తుతు రాజకీయాల్లో వెన్నుపోటు అన్న పదానికి స్థానం లేదు. అలా అనాల్సి వస్తే బిజెపినే అనాల్సి ఉంటుంది. బిజెపి నేతలు రాష్ట్రాలను కబళించడం తప్ప ప్రజల మనసులను గెలవడం లేదు. దేశ సమస్యలను పరిష్కరించడం లేదు. ధరలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ప్రభుత్వరంగ సంస్థల మూసివేతలపై సమాధానం ఇవ్వడం లేదు. అధికార మదంతో తాము చేసేదే సరైనదన్న ధోరణిలో ఉన్నారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే బీజేపీకి చేయిచ్చి, శరద్ పవార్, కాంగ్రెస్‌లతో చేయికలిపిన తరహా లో, అటువంటి ప్రమాదం నితీశ్ నుంచి వాటిల్లకుండా జాగ్రత్తపడింది. కానీ, అనతికాలంలో ఏక్‌నాథ్ షిండే ద్వారా వెన్నుపోటు రాజకీయంతో ఉద్ధవ్‌ను కూల్చి అధికారం స్వాధీనం చేసుకున్నది. ఇప్పుడు తనవంతు రావచ్చుననీ, బిహార్‌లో సొంతంగా అధికారంలోకి రావాలని ఉవ్విళ్ళూరుతున్న బీజేపిని నిలువ రించాలంటే కాంగ్రెస్, ఆర్జేడీవరటి మిగతాపార్టీలతో స్నేహం క్షేమమని నితీశ్ భావించి ఉంటారు. తన పార్టీలో కీలకమైన నాయకులు, మంత్రులు బీజేపీ గుప్పిట్లోకిపోవడం, అమిత్ షా వారితో నేరుగా వ్యవహారాలు నడుపు తుండటం కూడా నితీశ్ జాగ్రత్తపడడానికి కారణం కావచ్చు. తనను ఇప్పటికే బాగా బలహీనపరిచిన బీజేపీ విషయంలో నితీశ్ ఏం చేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. బీహార్ పరిణామాలతో బిజెపి పరివర్తన చెందాలి. ప్రజలు బిజెపి కావాలని కోరుకునేలా పాలన సాగాలి. ప్రజల సమస్యలకు సమాధానం రావాలి. అప్పుడే బిజెపిని ఆదరిస్తారు. అలా చేయకపోతే బిజెపికి కూడా పుట్టగతులు ఉండవు.

పృథ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# సుప్రీంలో వరవరరావుకు ఊరట

## శాశ్వత బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 (సమ సమాజం):** సామాజిక ఉద్యమకారుడు, విరసం నేత వరవరరావుకు ఎట్టకేలకు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. ఆయన అనారోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కోర్టు వరవరరావుకు శాశ్వత బెయిల్ ను మంజూరు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్ సారథ్యంలోని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం బెయిల్ ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో జరిగిన భీమా కోరేగావ్ కేసులో నిందితునిగా ఉన్న విప్లవ రచయిత వరవరరావు ఇప్పటికే పలుమార్లు శాశ్వత బెయిల్ కావాలని పిటిషన్ వేశారు. కానీ ఆయనకు అనుకూలంగా ఇప్పటివరకూ తీర్పు రాలేదు. ఈ నేపథ్యంలోనే 82ఏళ్ల వరవరరావుకు తాజాగా శాశ్వత బెయిల్ కు అంగీకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. మహారాష్ట్రలో చెలరేగిన భీమా కోరెగావ్ అల్లర్లు, మావోయిస్టులతో సంబంధాలు, ప్రధాని మోదీ హత్యకు కుట్రలతో సంబంధం ఉందన్న అభియోగాలతో వరవర రావును 2018 ఆగష్టులో అరెస్టు చేశారు. ఆయనతో పాటు మానవ హక్కుల కార్యకర్తలు వెర్నన్ గొంజాల్వెజ్, అరుణ్ ఫెరీరా, గౌతమ్ నవలాఖా, సుధా భరద్వాజ్‌లను పుణెళి పోలీసులు నిర్బంధించారు. అయితే గత కొంతకాలం నుంచి వైద్య కారణాల రిత్యా వరవరరావు తాత్కాలిక బెయిల్ లో ఉన్నాడు. అనారోగ్య కారణాల కారణంగా తనకు శాశ్వత బెయిల్ కావాలని ఇప్పటికే ఆయన పలుమార్లు కోర్టులో పిటిషన్లు వేశారు. కాగా ఈ నేపథ్యంలోనే వరవరరావుకు బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు తెలిపింది. భీమా కొరెగావ్ కేసులో బోంబే హైకోర్టు 2021 ఫిబ్రవరి 22న ఇచ్చిన ఆరు నెలల బెయిలును పర్మనెంట్ బెయిలుగా మార్చింది. అయితే ఈ కేసు విచారణ జరుగుతున్న ట్రయల్ కోర్టు అధికార పరిధి లోని ప్రాంతం నుంచి వెలుపలికి వెళ్ళకూడదని షరతు విధించింది. ఈ స్వేచ్ఛను దుర్వినియోగం చేయరాదని కూడా తెలిపింది. కేసు దర్యాప్తును ఏ విధంగానూ ప్రభావితం చేయరాదని, సాక్షులతో సంప్రదింపులు జరపకూడదని కూడా వివరించింది. ఆయన వయసు 82 సంవత్సరాలు కావడం, అంతేకాకుండా అనారోగ్య పరిస్థితులు ఉండటం వల్ల వైద్యపరమైన కారణాల మేరకు ఈ బెయిలును మంజూరు చేస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. చికిత్సకు సంబంధించి న వివరాలను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు తెలియజేయాలని వరవరరావును ఆదేశించింది. అంతకుముందు ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిగింది. నారోగ్య కారణాల దృష్ట్యా తనకు పర్మినెంట్ మెడికల్ బెయిల్ మంజూరు చేయాలని ఆయన కోరారు. జస్టిస్ యుయు లలిత్, జస్టిస్ రవీంద్ర భట్, జస్టిస్ సుధాంశు దులియా తో కూడిన ధర్మాసనం ముందు విచారణ జరిపి, ఆయన బెయిలును పర్మనెంట్ బెయిలుగా మార్చేసింది.

# అవసరం ఉన్న చోటల్లా ఫ్రీడమ్ పార్కుల ఏర్పాటు

### లక్ష్మీకుంటలో మొక్కలు నాటిన మంత్రి నిరంజన్



**వనపర్తి, ఆగస్ట్ 10 (సమ సమాజం):** అవకాశం ఉన్న ప్రతి చోటా ఫ్రీడం పార్కులను నిర్మిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. భారత స్వాతంత్ర వజ్రోత్సవాలలో భాగంగా వనపర్తి లక్ష్మికుంట వద్ద ఫ్రీడం పార్క్ లో విద్యార్థులు, పట్టణవాసులతో పెద్దఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..శ్రీనివాసపురం లక్ష్మికుంట భవిష్యత్ లో రాష్ట్రంలో ప్రముఖ ప్రాంతంగా మారబోతున్నది. రూ.కోటిన్నర వెచ్చించి చిన్న కుంటను పెద్ద చెరువుగా మార్చామన్నారు. లక్ష్మికుంట సమీపంలో 35 ఎకరాలలో ఫ్రీడం పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. వనపర్తిలో 11 వేల ఎకరాలలో అటవీ ప్రాంతం ఉందని, అటవీ ప్రాంతాలలో చెరువుల మూలంగా వివిధ రకాల జీవజాతుల పెంపునకు దోహదం పడుతుందన్నారు. సీఎం కేసీఆర్తలపెట్టిన భారత స్వాతంత్య వజ్రోత్సవాలలో ప్రజలు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తదితరులు ఉన్నారు.

## మునుగోడులో ఎరగురేది కాషాయ జెండానే

(మొదటి పేజి తరువాయి)వ్యక్తం చేశారు. అక్కడ రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగత ఇమేజ్‌తో పాటు, బిజెపి ప్రతిష్ట తోడు కానుందన్నారు. టిఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని అన్నారు.

## పుల్వామాలో మరోమారు భారీ ఉగ్రకుట్ర

(మొదటి పేజి తరువాయి) ముష్కరుల్లో లతీఫ్ రాథర్ సైతం ఉన్నాడని, కశ్మీర్‌లో రాహుల్ భట్, అమ్రీన్ భట్ సహా పలువురు పౌరులను చంపిన ఘటనల్లో అతడు కీలక నిందితుడని పోలీసులు తెలిపారు. మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ ఐఈడీ కలకలం రేపింది. ఐసిస్‌తో లింకులు ఉన్న ఓ ఉగ్రవాదిని యూపీ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ గురువారం అరెస్టు చేసింది. ఆజంగఢ్‌లోని ముబారక్‌నగర్ నుంచి నిందితుడు సాబుద్దీన్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. పలు సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున దేశంలో ఐఈడీ బాంబుదాడి చేసేందుకు నిందితుడు కుట్రపన్నాడని పోలీసులు వెల్లడించారు.

# గాంధీజీని స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలి

### ఇష్టపడి చదివి ఉన్న శిఖరాలకు చేరాలి

### విద్యార్థులకు మంత్రి సత్యవతి హితవు



**మహబూబాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** గాంధీజీని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఎదగాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. అలాగే ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. స్వాతంత్ర్య పోరాట చరిత్రను కూడా తెలుసుకోవాలన్నారు. బుధవారం ఆమె ఎమ్మెల్యే శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ కె. శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్ తో కలిసి స్థానిక సూర్య కళామందిర్ సినిమా టాకీస్‌లో గాంధీ చిత్రాన్ని విద్యార్థులతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకుని 75 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వాతంత్ర సమర యోధుల పోరాట పటిమను గుర్తు చేసుకునేలా వజ్రోత్సవ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం అభినందనీయమన్నారు. దీని నుంచి స్ఫూర్తి పొంది భావి భారత పౌరులుగా ఎదగాలన్నారు. సీఎం కేసీఆర్ గాంధీ చూపిన మార్గంలోనే రాష్ట్రం సాధించి అభివృద్ధిలో దేశంలోనే ముందంజలో ఉంచారన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాం మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, ఆర్డీవో కొమురయ్య, తహసిల్దార్ నాగాభవాని, తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ విధుల్లోకి ఉపాధిహామీ ఫీల్డ్



### హామీ నెరవేర్చిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** రాష్ట్రంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను మళ్లీ విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం నుంచే ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్లు, జిల్లా అధికారులకు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలు జారీ చేశారు. గతంలో పని చేసిన చోటే 7,305 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల విధులు నిర్వర్తించనున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకుంటామని ఇప్పటికే సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు.

## బీహార్‌లో కొలువుదీరిన మహాఘట్‌బంధన్

(మొదటి పేజి తరువాయి) మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీ, జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) సంకీర్ణ ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఆయన ముఖ్యమంత్రిగా రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. 2020లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్డీయే కూటమి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. కాగా, బీజేపీ, జేడీయూ, వీఐపీ, హెచ్ఏఎల్‌తో కలిసి నితీశ్ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. ఈ కూటమిలో ఈ ఏడాది ప్రారంభంలో చీలికలు ప్రారంభమయ్యాయి. చివరకు బీజేపీతో నితీశ్‌కుమార్ తెగతెంపులు చేసుకున్నారు.

# ప్రియాంకకు కరోనా పాజిటివ్

(మొదటి పేజి తరువాయి) కాంగ్రెస్ చింతన్ శిబిర్ రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో జరిగింది. ఈ సభలోనే ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించాలని నిర్ణయించారు. ఈఏడాది జూన్ లో కూడా ప్రియాంక గాంధీ కోవిడ్ బారిన పడ్డారు. ఆసమయంలోనూ ఆమె ఒంటరిగా ఐసోలేషన్ ఉండి చికిత్స పొందారు. మరో రెండు నెలలు తిరగకుండానే ఈఏడాదిలో రెండోసారి ప్రియాంక గాంధీకి కరోనా వైరస్ సోకింది. ప్రియాంకగాంధీతో పాటు కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ కూడా కోవిడ్ బారిన పడిన వారిలో ఉన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్‌పక్ష నాయకుడు, పార్టీ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే కూడా తనకు కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారణ అయినట్లు ట్విట్టర్ లో తెలిపిన విషయం తెలిసిందే. ఇటీవల నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఈడీ విచారణకు వ్యతిరే కంగా నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేతలకు వరుసగా కోవిడ్ సోకుతుండటంతో పార్టీ నాయకుల్లో ఆందోళన నెలకొంది.

# మునుగోడులో టిఆర్ఎస్‌దే గెలుపు

(మొదటి పేజి తరువాయి) హితవు పలికారు. దేశం కోసం త్యాగం చేసిన వారిని స్మరించుకోవడానికి సీఎం కేసీఆర్ అద్భుతమైన కార్యక్రమాలు చేపడుతున్నారని కవిత చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంతో మంది పోరాటం చేశారని చెప్పారు. తెలంగాణ రాక ముందు గ్రీనరీ 21 శాతం ఉంటే..ఇప్పుడు 31 శాతానికి పెరిగిందన్నారు. 34 శాతానికి గ్రీనరీ పెరిగే వరకు తెలంగాణ ప్రజలు నిష్క్రమించవద్దని కోరారు. ప్రతి ఒక్కరు జై హింద్ అనాలి..ప్రతి ఒక్కరు మొక్కలు నాటలని కవిత పిలుపునిచ్చారు.

# జాతి సమైక్యాతా స్ఫూర్తిని చాటాలి

### ఇంటింటా త్రివర్ణ పతకం ఎగురేయాలి

### ఫ్రీడమ్ పార్కులో మొక్కలు నాటిన తలసాని



**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసి జాతి సమైక్యత, స్ఫూర్తిని చాటాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేశ్‌కుమార్‌తో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని ఫ్రీడమ్ పార్క్‌లో మంత్రి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఎందరో మహనీయుల తాగ్యాల ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం లభించిందన్నారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్యం÷-ర సాధించిన మహనీయుడు గాంధీజీ అని, ఆయన గురించి విద్యార్థులకు తెలియజెప్పేందుకు గాంధీ చిత్రాన్ని రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్లలో ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. అలాగే 75 ప్రాంతాల్లో ఫ్రీడమ్ పార్కులను ఏర్పాటు చేసి, మొక్కలు నాటుతున్న పేర్కొన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకాలను ఎగురవేసి జాతి సమైక్యత, స్ఫూర్తిని చాటాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ లోని రోడ్ నెంబర్ 36 లోని ఫ్రీడమ్ పార్క్ లో మొక్కలు నాటిన మంత్రి తలసాని ... ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్రం లభించిందన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకోవడమే నిజమైన నివాళులు అని చెప్పుకొచ్చారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి ఐఅఖీ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని తలసాని స్పష్టం చేశారు. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన మహనీయుడు మహాత్మా అని గాంధీ సేవలను తలసాని కొనియాడారు. వజ్రోత్సవాలలో భాగంగా 75 ప్రాంతాల్లో ఫ్రీడమ్ పార్క్ లను ఏర్పాటు చేసి మొక్కలు నాటుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసానితో పాటు రాజ్యసభ సభ్యులు ఐ. కేశవరావు, ఓ౦ం దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేష్ కుమార్ పాల్గొన్నారు. ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను సైతం అర్పితం చేసి మన దేశానికి స్వాతంత్య్రం తెచ్చారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గాంధీజీ లాంటి మాహాత్ములు అహింస మార్గంలో దేశానికి స్వాతంత్య్రం రావాడానికి వారు ఎంతో కృషి చేశారని తెలిపారు. భారత వజ్రోత్సవాలలో భాగంగా సనత్ నగర్ నియోజకవర్గంలోని రాంగోపాల్ పేట్ డివిజన్ హైదరబస్తీలోని గ్రౌండ్ లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ 75 మొక్కలు నాటారు. ఈ నెల 8 నుంచి 22 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. అందులో భాగంగానే ఈ రోజు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని తలసాని చెప్పారు. ఈ రోజు మనమంతా ఇంత సంతోషంగా ఉన్నామంటే దానికి కారణం ఎంతో మంది స్వాతంత్య్ర సమరయోధుల త్యాగమేనని అన్నారు. అంతే కాకుండా ప్రతి రోజూ గాంధీ చిత్రాన్ని థియేటర్లలో ఉచితంగా ప్రదర్శిస్తున్నామని తలసాని స్పష్టం చేశారు.

# నిజాయితీ, నిబద్ధ రాజకీయాలకు నిలవుటద్దం

(మొదటి పేజి తరువాయి) ఉత్తరాదిన తెలిసిన దక్షిణాది నేత ఎవరైనా ఉన్నారంటే ఆయన వెంకయ్యానాయుడే. రాష్ట్రంలో బిజెపికి బలం లేకపోయినా స్వంత గొంతుక వినిపించి, అంచెలంచెలుగా జాతీయస్థాయికి ఎదిగిన నేత వెంకయ్య నాయుడు. బిజెపి అధికారంలో లేనప్పుడు జరిగిన సభల్లో వెంకయ్య నాయుడు మైకందుకుని వాగ్ధాటి, ఛలోక్తులు, ప్రాసలతో కూడిన ప్రసంగం చేసి ప్రజలను ఆకట్టు కునే వారు. వాజపేయి, ఆడ్వాణీ కూడా ఆయన ప్రసంగాన్ని ముగ్ధులై వినేవారు. అశోకా రోడ్‌లో బిజెపి కార్యాలయం నిర్మానుష్యంగా ఉన్న సమయంలో ఉదయాన్నే వెంకయ్య వచ్చి ఆఫీసు తాళాలు తెరిపించి రాత్రి వరకూ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ గడిపిన రోజులు బిజెపి నేతలు మరచిపోలేరు. ఓరకంగా చెప్పాలంటే బిజెపి బలోపేతంలో తనవంతుగా వెంకయ్య చేసిన కృషి మరువలేం. లోపల భావం ఎలా ఉన్నా వీడ్కోలు సభలో ప్రధాని మోడీ కూడా వెంకయ్యను అభినందించక తప్పలేదు. వెంకయ్య నాయుడు అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే గుజరాత్ సిఎంగా మోడీని తప్పించాలన్న వాజ్‌పేయ్ పట్టుబట్టినా అద్వానీతో కలసి వెంకయ్య అడ్డుకోగలిగారు. చమత్కార సంభాషణ, లోతైన రాజకీయ విశ్లేషణ, గంటల తరబడి వినేవారిని కదలకుండా చేసే వాక్పటిమ మరిచిపోలేనివి. నిజానికి మోడీ బిజెపి కోసమయినా నిజాయితీ రాజకీయాలు నడిపివుంటే అద్వానీ రాష్ట్రపతి అయివుంటే వారు. మురళీమనోహర్ జోషి కనీసం ఉపరాష్ట్రపతి అయివుండేవారు. వెంకయ్యనాయుడు పార్టీలో ఇంకా పనిచేస్తూ ఉండేవారు. కానీ మోడీకి అద్వానీతో పాటు అయనను అంటిపెట్టుకని వున్న నేతలను సాగనంపాలన్న దురాలోచనతో ఉన్నారు. ఇక పార్టీలో మిగిలింది ఇప్పుడు రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీలు మాత్రమే. వీరిని కూడా ఏదోరకంగా పార్టీకి ప్రభుత్వానికి దూరం చేయడం ఖాయం. ఇకపోతే రాజ్యసభ ఛైర్మన్‌గా వెంకయ్య నాయుడు గతంలో ఎవరూ చేయనంతగా కృషి చేశారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా వెంకయ్య నాయుడు రాజ్యసభలో చర్చకు అవకాశం ఇచ్చేవారు. సాధ్యమైనంతమేరకు చర్చలేకుండా బిల్లులను పాస్ చేయడాన్ని ఆయన ఇష్టపడేవారుకాదు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఆయన ఏకాభిప్రాయం ద్వారా బిల్లులు ఆమోదం పొందేందుకు, చర్చలు జరిగేందుకు ఆస్కారం కలిగించేవారు. సభా వ్యవహారాల కమిటీ సమావేశాల్లో ఛలోక్తులు విసురుతూ వాతావరణాన్ని చల్లబరిచేవారు. ఆయన పదవీ విరమణ చేస్తున్నందుకు అధికార పక్షం కంటే ప్రతిపక్ష సభ్యులే ఎక్కువగా బాధపడుతూ ఉంటారు. రాజ్యసభలో వెంకయ్యను ప్రశంసిస్తూ ఆయన సభా నిర్వహణా శైలిని, స్నేహశీలతను మెచ్చుకోవడం యాంత్రికంగా జరిగింది కాదు. నేటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వెంకయ్య నాయుడు లాంటి నేతల అవసరం ఎంతో ఉన్నదని సిపిఐ(ఎం) సభ్యుడు జాన్ బ్రిటాస్ సైతం వ్యాఖ్యానించారు.

# ఘనంగా వజ్రోత్సవాల నిర్వహణ

### మొక్కలు నాటిన స్పీకర్ పోచారం



**కామారెడ్డి, ఆగస్ట్ 10 (సమ సమాజం):** స్వాతంత్ర్యవజ్రోత్సవాలనుపురస్కరించుకునివనమహోత్సవంలో భాగంగా బాన్సువాడ గ్రామీణ మండలం జేకే తండాలో శాసన సభ స్పీకర్ పోచారంశ్రీనివాసరెడ్డిమొక్కలునాటిజాతీయజెండాలుపంపిణీచేశారు. ఈసందర్భంగా స్పీకర్ పోచారం మాట్లాడుతూ..దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి75సంవత్సరాలుఅయిన సందర్భంగారాష్ట్ర ప్రభుత్వం'స్వాతంత్ర్యవజ్రోత్సవాలను'ఘనంగానిర్వహిస్తుందన్నారు. ఈనెల 8 నుంచి 22 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆంగ్లేయుల నుంచి దేశానికి స్వాతంత్యంర తీసుకురావడానికి ఎందరో వీరులు త్యాగం చేశారు. స్వాతంత్య ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలని స్పీకర్ తెలిపారు. కులమతాలకుఅతీతంగాదేశప్రజలందరూస్వాతంత్రదినోత్సవవేడుకలుజరుపుకోవాలన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల జాతీయ జెండాలను ఉచితంగా ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. అందరూ తప్పనిసరిగా తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేయాలన్నారు.

# బ్యాలెట్ ద్వారా మునుగోడు ఉప ఎన్నిక

**ప్రజాశాంతి పార్టీ నేత కెఎపాల్ డిమాండ్**

**బిజెపియే గెలుస్తుందని జోస్యం**

**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** ఉప ఎన్నికను బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని కెఎ పాల్ డిమాండ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బీజేపీయే గెలుస్తుందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ అన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ లక్ష కోట్లు ఖర్చు చేసినా..బీజేపీ గెలుపును అడ్డుకోలేద న్నారు. మునుగోడు ఎన్నికల తర్వాత టీఆర్ఎస్, కాంగ్రెస్ ఖాళీ అవుతుందని.. అంతా బీజేపీలో చేరతారని చెప్పారు. రాజగోపాల్ రెడ్డి రాజీనామా చేస్తే మునుగోడులో అడుగు పెడతానని తాను చెప్పినట్లు కేఏపాల్ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం..ఆగస్టు 19,20 తేదీల్లో తాను మునుగోడులో పర్యటిస్తానని తెలిపారు. కేసీఆర్‌ను కలవాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా...కొంతమంది టీఆర్ఎస్ నేతలు అడ్డుకుంటు న్నారని కేఏపాల్ అన్నారు. కేటీఆర్ రాజకీయంగా ఇంకా పరిపక్వత చెందలేదు అని చెప్పారు. కేసీఆర్‌కు తనకు గొడవ పెట్టింది దిలీప్ కుమార్ అంటూ ఆరోపించారు. కేసీఆర్‌ను కలవటానికి అపాయింట్ మెంట్ కోరినా ఇవ్వలేదని మండిపడ్డారు. తాను ఒక తెలుగు వాడిని అయినందుకే కేసిఆర్ చిన్న చూపు చూస్తున్నారని చెప్పారు. మోడీ ప్రభుత్వంలో ఇండియా ఆర్థికంగా దెబ్బతిన్నదని..త్వరలో భారత్ మరొక శ్రీలంక అవుతుందని పాల్ అన్నారు. యూపీ సీఎం యోగి దేశంలోనే వరస్ట్ సీఎం అని విమర్శించారు. మోడీ తరువాత తానే పీఎం అని కలలు కంటున్నాడన్ని ÷ర్ అయ్యారు. తాను బీజేపీకి భయపడే ప్రసక్తే లేదని కేఏ పాల్ అన్నారు. ఈడీ, సీబీఐలతో బీజేపీ ప్రభుత్వం ఎవరినైనా భయపెట్టొచ్చు కానీ..తనను భయపెట్టలేదన్నారు. త్వరలో ' సేవ్ ఇండియా ఫ్రం మోడీ' బుక్ ,వాల్ పోస్టర్‌ను రిలీజ్ చేస్తున్నామని పేర్కొన్నారు. మతతత్వ బీజేపీ ,ఆర్ఎస్ఎస్, మోడీ నుండి దేశాన్ని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# శివార్లలో డ్రగ్స్ తయారీ ముఠా

**వలపన్ని పట్టుకున్న రాచకొండ పోలీసులు**



**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** హైదరాబాద్ శివార్లలో డ్రగ్స్ తయారు చేస్తోన్న ముఠాను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో సింథటిక్ డ్రగ్స్ తయాచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గత కొన్నాళ్ల నుంచి డ్రగ్స్ తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు సీపీ మహేష్ భగవత్ తెలిపారు. ఈ కేసులో ఇద్దరినీ అరెస్ట్ చేశామన్న సీపీ..అరెస్ట్ అయినవారిలో పులిచర్ల శ్రీనివాస్ రెడ్డి పాత నేరస్తుడని చెప్పారు. 2010లో ఎన్‌సీబి చెన్నై, 2014లో ఎన్‌సీబి హైదరాబాద్, 2015లో కీసర పీఎస్, 2018లో ఉప్పల్ పీఎస్ లో నమోదైన కేసుల్లో అతడు నిందితుడుగా ఉన్నట్లు వెల్లడించారు. మరో నిందితుడు లెనిన్ బాబు ఆర్గానిక్ కెమిస్ట్రీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చేశాడని సీపీ మహేష్ భగవత్ తెలిపారు. 2014 లో అక్షజ్ మాలిక్యూలర్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ ను స్థాపించాడన్నారు.

# టీఆర్ఎస్‌లో మునుగోడు టిక్కెట్ కలకలం

**మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్లకు టిక్కెట్ ఇవ్వద్దన్న నేతలు**

**అత్యవసరంగా మంత్రి జగదీశ్ రెడ్డి నివాసంలో భేటీ**

**అసమ్మతి నేతలతో చర్చించి బుజ్జగించిన మంత్రి**

**బరిలోకి దిగేందుకు లెఫ్ట నేతల యత్నాలు**




**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** తెలంగాణలో ఊహించని పరిణామాల మధ్య కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కోమటిరెడ్డి రాజీనామాను స్పీకర్ పోచారం శ్రీనివాస్ ఆమోదించడంతో మునుగోడులో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో, మునుగోడులో ఉప ఎన్నికపై ప్రతిపక్ష పార్టీలతో సహా అధికార పార్టీ సైతం ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం తెలంగాణలో పొలిటికల్ హీట్ అంతా మునుగోడుపైనే ఉంది. అధికార పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలు కూడా మునుగోడుపైనే ఫోకస్ పెట్టాయి. ఉప ఎన్నికల బరిలో ఎవరిని పోటీలో నిలపాలి అని కసరత్తులు చేస్తున్నాయి. అధికార టీఆర్ఎస్ ఎలాగైనా మునుగోడులో గులాబీ జెండా ఎగురవేయాలని పావులు కదుపుతుండగా ఊహించని అసమ్మతి సెగ తగిలింది. ఉపఎన్నికకు సిద్ధమవుతున్న మునుగోడులో తెరాస నాయకుల మధ్య విబేధాలు బయట పడ్డాయి. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికే మళ్లీ అవకాశం ఇవ్వనున్నట్ల తెరాస కీలక నేతలు సంకేతాలు ఇవ్వడంతో పలువురు నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూసుకుంట్లకు టికెట్ ఇవ్వొద్దని సీఎం కేసీఆర్‌కు కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు లేఖ రాశారు. తెరాస శ్రేణుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి రంగంలోకి దిగారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. మునుగోడు ఉపఎన్నికల్లో పోటీకి తెరాస నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ టికెట్ ఆశిస్తున్నారు. అయితే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికే మరోసారి అవకాశం ఇచ్చేందుకే పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతున్నట్లు తెరాస ముఖ్య నేతలు సంకేతాలిస్తు న్నారు. గుత్తా సుఖేందర్ రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, కర్నె ప్రభాకర్‌ను నియోజకవర్గానికే పరిమితం చేయకుండా రాష్ట్రస్థాయిలో వారి సేవలు వినియోగించుకోవాలని పార్టీ భావిస్తోందని చెబుతున్నారు. పార్టీ సర్వేలన్నీ కూసుకుంట్లకే ప్రాధాన్యమిచ్చాయని జిల్లాకు చెందిన కొందరు ముఖ్య నేతలు చెబుతున్నారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వైపే మంత్రి జగదీష్ రెడ్డి కూడా మొగ్గు చూపుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో నియోజకవర్గంలోని పలువురు నేతల్లో అసంతృప్తి నెలకొంది. కూసుకుంట్లకు టికెట్ ఇవ్వొద్దంటూ ఇటీవల సుమారు 12 మంది స్థానిక నాయకులు సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా తెరాస గాలి వీచిన 2018 ఎన్నికల్లో కూసుకుంట్ల ఓడిపోయారని.. ఉపఎన్నికల్లో అభ్యర్థిని మార్చాలని నియోజక వర్గంలోని కొందరు నేతలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో పరిస్థితిని చక్కబెట్టే బాధ్యతను మంత్రి జగదీష్ రెడ్డికి సీఎం కేసీఆర్ అప్పగించారు. ఈ క్రమంలో హైదరాబాద్ లోని తన నివాసంలో జగదీష్ రెడ్డి నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశయ్యారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు తదితర సుమారు ముప్పై మంది నాయకులు సమావేశానికి హాజరయ్యారు. మునుగోడులో గులాబీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ శ్రేణులకు జగదీష్ రెడ్డి చెప్పారు. అధిష్ఠానం ఖరారు చేసిన అభ్యర్థికి పార్టీ నాయకులు అందరూ కలిసి పనిచేయాలని కోరారు. టికెట్ ఎవరికి వచ్చినా.. భవిష్యత్తులో అందరికీ తగిన అవకాశాలు ఉంటాయని నచ్చచెప్పినట్లు సమాచారం. ఈ క్రమంలో టీఆర్ఎస్ నేత,మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి టికెట్ ఇవ్వొదని వారు అసమ్మతి గళం వినిపించారు. కూసుమంట్లకు టికెట్ ఇస్తే ఎన్నికల్లో మద్దతు ఇచ్చేది లేదంటు తేల్చి చెప్పారు. ఈ విషయంపై వారం క్రితమే సీఎం కేసీఆర్‌కు అసమ్మతి నేతలు లేఖలు రాసినట్టు తెలిపారు. కాగా, సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి జగదీష్ రెడ్డి అసమ్మతి నేతలను బుజ్జగిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుంటే మునుగోడుపై అటు కాంగ్రెస్ కూడా కసరత్తు మొదలు పెట్టింది. ఇదిలా ఉండగా.. మునుగోడు ఉప ఎన్నిక బరిలో వామపక్షాలు సైతం పోటీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఉప ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా? అనే దానిపై వామపక్షాల కమిటీ నిర్ణయం తీసుకోనుంది. అయితే, మునుగోడులో వామపక్షాల కేడర్ బలంగా ఉన్నందున పోటీలో ఉండాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు సమాచారం. మరోవైపు.. గతంలో అధికార టీఆర్ఎస్‌కు వామపక్షాలు మద్దతు తెలిపాయి. ఇతర పార్టీలకు మద్దతు ఇస్తే తప్పుదు సంకేతాలు వెళ్తామన్న భావనలో వామపక్షాలు ఉన్నట్టు తెలుస్తోంది.

# స్వాతంత్ర్య వజ్రోత్సవాల వేళ వన మహోత్సవం



**ఫ్రీడం పార్కులో మొక్కలు నాటిన మంత్రి వేముల ◆ గాంధీ మార్గంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు**

**నిజామాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** భారత స్వాతంత్య వజ్రోత్సవాలు పురస్కరించుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు.. వనమహోత్సవంలో భాగంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి జిల్లాలోని పడగల్ గ్రామంలోని ఫ్రీడమ్ పార్క్‌లో మొక్కలు నాటారు. దేశానికి స్వాతంత్య సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ఫ్రీడమ్ పార్క్' లో ఏక కాలంలో 750 మొక్కలు నాటారు. స్వాతంత్య వజ్రోత్సవాల సదర్భంగా ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని మంత్రి సూచించారు. దేశం గర్వించేలా వజ్రోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు ఆయన జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అహింస మార్గంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గాంధీజీ అహింసమార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని గుర్తు చేశారు. మహాత్మాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని కొనసాగించారని తెలిపారు. వజ్రోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ భావాన్ని పెంపొందించేందుకు 15 రోజుల పాటు రాష్ట్రంలో వజ్రోత్సవాలు ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. స్వతంత్య ఉద్యమంలో త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని ప్రభుత్వం అం దజేస్తుందని పేర్కొన్నారు. రైతులకు 24గంటల పాటు నిరంతరం విద్యుత్‌ను ఇస్తున్నామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభించి రైతులకు సాగునీరు అందిస్తున్నామని, గ్రామాల్లో వైకుంఠ ధామాలు, కంపోస్టుషెడ్డులు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పా టు చేసి ప్లలెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సంక్షేమ గురుకుల పాఠశాలల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తున్నామని అన్నారు. గ్రామాల్లోని నిరుపేదలు ఆకలితో అలమటించవద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసరా పింఛన్లను అందజేసి వారి ఆకలిని తీరుస్తున్నారని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం జరిగిన అభివృద్ధి విషయంలో సర్వే చేపట్టగా తెలంగాణలోని 10 గ్రామాలు అభివృ ద్ధి చెందిన జాబితాలో ఎంపికయ్యాయని తెలిపారు. ఈనెల 15న ప్రతీ ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేసి భారత దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటాలని తెలిపారు. జాతీయ పతకాలను అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలకు అందించాలని తెలిపారు.

# జాతీయ రాజకీయాలపై బీహార్ ప్రభావం ఉండదు




**వీటిని కేవలం స్థానిక రాజకీయాలుగానే చూడాలి**

**ప్రత్యామ్నాయా రాజకీయాలకు అవకాశం లేదు**

**వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వెల్లడి**

**పాట్నా, ఆగస్ట్ 10 (సమ సమాజం):** బీహార్‌లో తాజా పరిణామాలతో జాతీయస్థాయి ప్రత్యామ్నాయానికి అవకాశం లేదని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అన్నారు. అలాగే ప్రత్యామ్నాయ రాజకీయాలకు నితీశ్ నాయకత్వం కూడా సాధ్యం కాదన్నారు. ఇది కేవలం బీహార్ పరిణామంగానే చూడాలన్నారు. మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా నితీశ్ కుమార్ ఉంటారన్న ఊహాగానాలను ప్రశాంత్ కిషోర్ తిరస్కరించారు. ఆయనకు అలాంటి ఆశ లేదని తాను అనుకుంటున్నట్లు తెలిపారు. బీహార్ రాజకీయాల్లోనే కీలకంగా ఉంటారని అభిప్రాయపడ్డారు. బీహార్‌లో తాజా రాజకీయ పరిణామాలు రాష్ట్రానికి సంబంధించి నవేనని తాను నమ్ముతున్నానని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ ప్రతిపక్షాన్ని సృష్టించాలనే ఆలోచనతో ఇది జరిగిందని తాను అనుకోవడం లేదన్నారు. జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ 2017లో బీజేపీతో పొత్తు తర్వాత సంతోషంగా కనిపించలేదని, బలవంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లుగా ఆయన ఫీల్ అయ్యారని బీహార్‌కు చెందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ అన్నారు. ఎన్డీయే కూటమి నుంచి వైదొలగిన నితీశ్ కుమార్ ఆర్జేడీ నేతృత్వంలోని మహాకూటమి మద్దతుతో మరోసారి సీఎంగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో జేడీయూ మాజీ నేత అయిన ప్రశాంత్ కుమార్ దీనిపై స్పందించారు. బీహార్‌లో గత పదేళ్లుగా రాజకీయ అస్థిరత యుగం కొనసాగుతోందని, ప్రస్తుత పరిణామాలు కూడా ఆ దిశగానే ఉన్నాయని తెలిపారు. దీనికి నితీష్ కుమార్ ప్రధాన పాత్రధారి, సూత్రధారి అని చెప్పారు. 2013 నుంచి బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు ఇది 6వ ప్రయత్నమని అన్నారు. ఒకరి రాజకీయ లేదా పరిపాలనా అంచనాలు నెరవేరనప్పుడు నిర్మాణాలు మారుతాయని వ్యాఖ్యానించారు. కాగా, 2015 కూటమి ప్రభుత్వం , ప్రస్తుత మహాకూటమి ప్రభుత్వం పూర్తిగా వేరని ప్రశాంత్ కిషోర్ అన్నారు. 2015 కూటమి ప్రభుత్వం రాజకీయ స్వభావంతో కూడుకున్నదని, 2022 మహాకూటమిలో పరిపాలన దృక్కోణం ఎక్కువగా ఉందని తెలిపారు. అయితే కొత్త ప్రభుత్వం గత ప్రభుత్వం కంటే మెరుగ్గా పనిచేస్తుందా లేదా అనేది చూడాల్సి ఉందన్నారు. కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నట్లుగా నితీష్ కుమార్ చెప్పారని, దీంతో బీహార్ ప్రజల ఆకాంక్షలను ఆయన నెరవేరుస్తారని, బీహార్ రాజకీయాల్లో స్థిరత్వం తిరిగి నెలకొంటుందని తాను ఆశిస్తున్నానని అన్నారు. బీహార్‌లో ఏకైక అతిపెద్ద పార్టీ నాయకుడైన తేజస్వి యాదవ్ కొత్త ప్రభుత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తారని అంచనా వేశారు.

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ



**ఆదాయ వనరుల సమీకఅపైనే ప్రధాన దృష్టి**

**ఆర్థిక లోటు భర్తీకి చర్చిచే అవకాశాలు**

**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర ఖజానాకు నిధులు సమకూర్చుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2022-23 బ్జడెట్‌లో ఏకంగా రూ.45 వేల కోట్లు లోటు ఏర్పడుతోంది. దీనిని పూడ్చుకునేందుకు సర్కార్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. కేంద్రం మోకాలడ్డుతూ సహకరించక పోవడంతో ప్రత్యామ్నాయ ప్రయత్నాలు ప్రారంబించింది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఖజానాకు నిధులు సమకూర్చుకోవడంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 2022-23 బ్జడెట్‌లో ఏకంగా రూ.45 వేల కోట్లు లోటు ఏర్పడుతోంది. దీనిని పూడ్చుకునేందుకు సర్కార్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ పరిస్థితుల నడుమ గురువారం 11న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. సిఎం కెసిఆర్ అధ్యక్షతన ప్రగతిభవన్లఓ భేటీ జరుగనుంది. ఈ భేటీలో ఆదాయ వనరుల సమీకరణపైనే ప్రదాన చర్చ జరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. రుణ సమీకరణలో కేంద్రం సహాయనిరాకరణ, తెలంగాణ పట్ల వివక్షపై చర్చించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో ఏర్పాటైన సబ్‌కమిటీ సిఫార్సులను కేబినెట్ భేటీలో చర్చించ నున్నారు. ప్రజలపై ఎక్కువగా భారం పడకుండా ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ల పేరిట తీసుకునే రుణాలకు ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీని రాష్ట్ర అప్పుల కింద లెక్కగడతామని కేంద్రం ఇటీవల ప్రకటించింది. ఫలితంగా ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిపై ప్రభావం పడుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ అంచనా వేసింది. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేంద్ర సాయం అంచనాల్లో రూ.18 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లు లోటు ఏర్పడుతోందని అంచనా. కేంద్రం పన్నుల్లో రాష్ట్రాల వాటా పెంచామంటున్నప్పటికీ.. పథకాలకు కోతలతో గతంలో కంటే తక్కువగా నిధులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆగస్టు 15 నుంచి పది లక్షల కొత్త పింఛన్లు ఇస్తుండటంతో రాష్ట్ర ఖజానాపై ఆర్థికంగా భారం పడనుంది. రూ.లక్ష వరకు రుణమాఫీ, నిర్మాణ వ్యయం, రుణాల అసలు, వడ్డీ చెల్లింపులు, వరద నష్టం, ప్రాజెక్టుల మరమ్మతులు వంటివాటికి నిధుల అవసరం భారీగా పెరగనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి కాగ్ విడుదల చేసిన గణాంకాల్లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ 6 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా 5 శాతం మేర మాత్రమే వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రుణాల ద్వారా తెలంగాణ ప్రభుత్వం రూ.48,724.12 కోట్లు సమీకరించుకోవాలన్న లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటివరకు రూ.14,500 కోట్లు ఆర్‌బీఐ నుంచి సమకూర్చుకుంది. మరో రూ.10 వేల కోట్ల రుణ వెసులుబాటుకు కేంద్రం అంగీకారం తెలిపింది. మరో రూ.25 వేల కోట్లను బహిరంగ మార్కెట్ నుంచి రుణాలనే సేకరించాల్సి ఉంది. రాష్ట్రంలో ఇసుక అమ్మకాలు, మైనింగ్ రాయల్టీ పెంపు, ఎల్ఆర్ఎస్ అమలు, పన్ను లీకేజీలు, రాజీవ్ స్వగృహ ఇండ్లు, నిరుపయోగ భూముల అమ్మకాలను అరికట్టడం వంటి అంశాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టనుందని అధికార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మొత్తంగా ఈ వ్యవహారలపైనే కేబినేట్‌లో సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఆదాయ వనరుల సమీకరణకు పెద్ద కసరత్తే చేయబోతున్నారు.

# ఎగువన వర్షాలతో మళ్లీ పెరుగుతున్న వరద

**కృష్ణా,గోదావరి నదులకు పెరుగుతున్న ప్రవాహం**

**శ్రీశైలం 8గేట్లు ఎత్తివేత..సాగర్‌లోకి కొనసాగుతున్న నీటిరాక**

**భద్రాచలం వద్ద కొనసాగుతున్న నీటి పెరుగుదల**

**హైదరాబాద్, ఆగస్ట్ 10 (సమ సమాజం):** కృష్ణా,గోదావరి నదుల్లోకి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. దీంతో అధికారులు శ్రీశైలం 8 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలాన్నారు. ఎగువ నుంచి ప్రవాహం పెరుగు తుండటాన్ని బట్టి నాగార్జునసాగర్ గేట్లు గురువారం తెరచుకునే అవకాశాలున్నాయి. మరోవైపు భద్రాచలం వద్ద గోదావరి భీకర రూపం దాల్చుతోంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీచేశారు. ఎగువన వర్షాలతో కృష్ణా గోదావరి నదుల్లో ఉద్ధృత ప్రవాహం నమోదవుతోంది. కృష్ణానదికి వస్తున్న భారీ వరదతో శ్రీశైలం జలాశయం గేట్లను ఒక్కోటి పెంచుతూ మంగళవారం రాత్రికి ఎనిమిదింటిని తెరిచారు. ఏపీ, తెలంగాణ ఉత్పత్తి కేంద్రాల ద్వారా జలవిద్యుత్‌ను తయారు చేస్తున్నారు. జలాశయం నుంచి దిగువకు రెండు లక్షల క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. నారాయణపూర్ నుంచి 1.46 లక్షల, తుంగభద్ర డ్యాం నుంచి 1.59 లక్షల క్యూసెక్కులు విడుదలవుతుండగా ఇవి మరింత పెరిగే సూచనలున్నాయి. మరోవైపు నాగార్జునసాగర్ వద్ద 1.83 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఎ÷-లో నమోదవుతోంది. మంగళవారం సాయంత్రానికి ఈ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు 578.20 అడుగుల వద్ద ఉంది. 589.50 అడుగులకు చేరుకున్నాక గేట్లు తెరవాలని ఇంజినీర్లు భావిస్తున్నారు. ఎగువ నుంచి ప్రవాహం పెరుగుతుండటాన్ని బట్టి గురువారం గేట్లు తెరచుకునే అవకాశాలున్నాయి. గతేడాది ఆగస్టు నెలలోనే సాగర్ గేట్లు తెరచుకున్నాయి. కృష్ణానదికి భారీ వరదలు వచ్చినపుడు తప్ప మరెప్పుడూ ఆగస్టులో గేట్లు తెరచుకున్న దాఖలాలు లేవు. గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఎత్తిపోతల్లో లక్ష్మీ బ్యారేజీ (మేడిగడ్డ) వద్ద 7.30 లక్షల క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తోంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువన మానేరు ఇతర ఉపనదులు, వాగులతోపాటు ప్రాణహిత నుంచి వస్తున్న వరదతో మేడిగడ్డ నుంచి దిగువకు పెద్దఎత్తున ప్రవాహం వెళ్తోంది.



ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం సమీపంలో జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో ఛత్తీస్‌గఢ్‌కు రాకపోకలు నిలిచి పోయాయి.మరోవైపు భద్రాచలం వద్ద గోదావరి భీకర రూపం దాల్చుతోంది. అర్ధరాత్రి ఒంటి గంటకు 48 అడుగులకు చేరిన నీటిమట్టం నమోదైంది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీచేశారు.ఉదయం 11 గంటలకు గోదావరి నీటిమట్టం 50.3 అడుగులకు చేరుకుంది. నీటిమట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక అమల్లోకి రానుంది. గోదావరిలోకి ఎగువ నుంచి 12.72 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. బంగాళాఖాతంలో రెండు రోజుల క్రితం ఏర్పడిన అల్పపీడనం మంగళవారం మరింత బలపడి వాయుగుండంగా మారింది. ఇది ఒడిశాపై కేంద్రీకృతమై ఉంది. రుతుపవనాల ద్రోణి గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి వాయుగుండం ఏర్పడిన ప్రాంతం వరకూ వ్యాపించింది. తెలంగాణలో బుధ, గురువారాల్లో వర్షాలు తగ్గుముఖం పడతాయని, అక్కడక్కడ ఒక మోస్తరుగా కురవవచ్చని వాతావరణశాఖ తెలిపింది. మంగళవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ..రాష్ట్రంలో అత్యధికంగా నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో 4.3, డిచ్‌పల్లిలో 3.9, సాలూరలో 3.3, చిమ్మంపల్లిలో 3.3, నిజామాబాద్‌లో 3.2 సెంటీమీటర్ల వంతున వర్షం కురిసింది. భద్రాచలం దగ్గర మళ్లీ గోదావరి ఉధృతి పెరిగింది. భద్రాచలం దగ్గర 49.3 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరింది.

# ముగిసిన ఉపరాష్ట్రపతి జర్నీ

**మొక్కను నాటి సందేశం ఇచ్చిన వెంకయ్య**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10 (సమ సమాజం):** ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు జర్నీ ముగిసింది. బుధవారం ఆయన తన చివరి రోజు మొక్కను నాటి దేశ ప్రజలకు సందేశం ఇచ్చారు. మొక్కలు నాటేందుకు, పరిరక్షించేందుకు అందరూ చొరవ చూపాలని కోరారు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. బుధవారం ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పార్లమెంటులో 'సీత అశోక' మొక్కను నాటారు వెంకయ్య. భారతీయ సంప్రదాయంలో చెట్ల ప్రాముఖ్యాన్ని గుర్తుచేశారు. ఒక్క చెట్టు.. అనేక మంది పుత్రులకు సమానమన్న పురాణ పురుషుల వ్యాఖ్యల్ని ప్రస్తావించారు.




# చలన చిత్రం



## సామ్ కనిపిస్తే హాయ్ చెబుతా చైతూ డైలాగ్‌పై సర్వత్రా చర్చ

సమంత-నాగచైతన్య విడిపోయి 10నెలలు కావొస్తున్నా వీరి విడాకులపై ఇంకా చర్చ కొనసాగుతూనే ఉంది.ఇక లాల్ సింగ్ చడ్డా సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న నాగ చైతన్య ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నాడు. అయితే ఇందులో సినిమాకు సంబంధించిన విషయాలే కాకుండా పర్సనల్ లైఫ్‌పై కూడా చై ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుంది.ఇప్పటికే సమంతతో భవిష్యత్తులో నటించే అవకాశం ఉందా అని అడగ్గా అలా జరిగితే క్రేజీగా ఉంటుందని బదులిచ్చిన చై తాజాగా మరోసారి సమంత గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న చైతూకు ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో భాగంగా సమంత మీకు ఎదురు పడితే ఏం చేస్తారు అని అడగ్గా.. ఆమెకు హాయ్ చెప్పి హగ్ ఇస్తానంటూ ఆన్సర్ ఇచ్చాడు. దీంతో చై చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతంలో ఇదే ప్రశ్న సమంతకు కూడా ఎదురైన సంగతి తెలిసిందే. అందుకు బదులుగా సమాధానమిస్తూ.. మా ఇద్దరిని ఒకే గదిలో ఉంచితే అక్కడ పదునైన వస్తులేవీ లేకుండా చూసుకోవాలి అంటూ సామ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. కానీ చై మాత్రం హాయ్ చెప్పడమే కాకుండా హగ్ ఇస్తానంటూ షాకింగ్ ఆన్సర్ ఇవ్వడంతో వీరిద్దరి ఆలోచనలకు ఎంత తేడా ఉంది అంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



## బింబిసార కోసం రవితేజను సంప్రదించిన వశిష్ట

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా 'బింబిసార' హవా నడుస్తుంది. 'పటాస్' తర్వాత దాదాపు ఏడేళ్ళకు కళ్యాణ్‌రామ్ ఈ చిత్రంతో కమర్షియల్ హిట్‌ను సాధించాడు. ఈయన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా బింబిసార నిలిచింది. కేవలం మూడు రోజుల్లోనే ఈ చిత్రం బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని బాక్సాఫీస్ దగ్గర దూసుకుపోతుంది. ఈ చిత్రంలో కళ్యాణ్‌రామ్ నటనకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. దర్శకుడు మల్లిడి వశిష్ఠ డెబ్యూ సినిమానే అయినా.. తన టేకింగ్‌కు, పాత్రలను మలిచిన విధానంకు సినీ ప్రముఖులు సైతం ఫిదా అవుతున్నారు. ఇదిలా ఉంటే ముందుగా ఈ కథ ఓ స్టార్ హీరో దగ్గరకు వెళ్ళిందట. కానీ ఆయన రిజెక్ట్ చేశాడట. ఇంతకీ ఎవరా? స్టార్ హీరో అనుకుంటున్నారా? ఆయన మరెవరో కాదు మాస్‌రాజా రవితేజ. దర్శకుడు వశిష్ఠ ముందుగా ఈ కథను రవితేజకు చెప్పాడట. అయితే రవితేజకు కథ బాగా నచ్చిందట. కానీ ఆ పాత్రకు తను సూట్ కానని రిజెక్ట్ చేశాడట. దాంతో ఈ కథ కళ్యాణ్‌రామ్ వద్దకు చేరిందట. ముందుగా కళ్యాణ్‌రామ్ కూడా ఈ పాత్రలో తను సూట్ అవుతానో లేదో అని సందిగ్ధంలో పడ్డాడట. అయితే బింబిసారి లుక్ టెస్ట్ జరిపి ఆ ఫోటోలను ఎన్‌టీఆర్‌కు పంపాడట. తారక్ నుండి మంచి కాంప్లిమెంట్ రావడంతో కళ్యాణ్‌రామ్‌కు ధైర్యం వచ్చిందట. ఈ చిత్రంలో కళ్యాణ్‌రామ్‌కు జోడీగా కేథరిన్ ట్రెసా, సంయుక్తమీనన్‌లు నటించారు. శ్రీనివాస్ రెడ్డి కీలకపాత్రలో నటించాడు. కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రం ఇప్పటికే 9కోట్ల వరకు ప్రాఫిట్‌లను దక్కించుకుంది.



## దసరాకు విడుదలవుతున్న స్వాతిముత్యం

లక్ష్మణ్ కె కృష్ణ డైరెక్షన్ లో బెల్లంకొండ గణెశష్ హీరోగా నటిస్తున్న సినిమా స్వాతిముత్యం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై నిర్మాత సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ మూవీ ఈ నెల 13న విడుదల కావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు ఇటీవలే నిర్మాణ సంస్థ ప్రకటించింది. దసరా కానుకగా అక్టోబర్ 5న గ్రాండ్ గా రిలిజ్ చేయనున్నట్లు ప్రకటించారు. కొత్త రిలీజ్ డేట్ తెలుపు సినిమాలోని ఓ పోస్టర్ ను వదిలారు. పోస్టర్ లో హీరో బెల్లంకొండ గణెశష్, హీరోయిన్ వర్ష బొల్లమ్మ లుక్స్ ఆకట్టుకుంటున్నాయి. గతంలో సినిమా ఆపేసిన కారణంపై నిర్మాత నాగవంశీ స్పందిస్తూ?'ముందుగా అనుకున్న తేదీన సినిమా విడుదల కోసం పోస్ట్ ప్రొడక్షన్ సహా అన్ని కార్యక్రమాలు జరుపుకున్నాం. పరిశ్రమలో కొన్ని ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. థియేటర్‌లకు అప్పటిలాగ ప్రేక్షకులు రావడం లేదు. మాకిది సరైన సమయమే అయినా.. మిగతా సినిమాలకు ఇబ్బంది కలిగించకూడదని విడుదల వాయిదా వేస్తున్నాం. ఇది మాకు ఇబ్బంది కలిగించినా తప్పడం లేదు. త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ క్రమంలోనే కొత్త తేదీని అనౌన్స్ చేసిన యూనిట్.. దసరా సెలవులు.. సెలబ్రేషన్స్ కలెక్షన్స్ పరంగా కలిసొస్తాయని భావిస్తున్నట్లు తెలుస్తుంది. మరి చూడాలి.. దసరాకు వచ్చే పెద్ద సినిమాలను తట్టుకుంటుందా.. మళ్లీ పోటీ నుంచి తప్పకుంటుందా..!



## క్రైమ్ థ్రిల్లర్‌గా ఆనంద్ దేవరకొండ సినిమా

'దొరసాని' సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చాడు విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ. మొదటి సినిమాతోనే డిజాస్టర్‌ను సాధించి ప్రేక్షకుల నుండి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఆ తర్వాత గతేడాది ఓటీటీలో నేరుగా విడుదలైన 'మిడిల్ క్లాస్ మెలోడీస్'తో మంచి ప్రశంసలు అందుకున్నాడు. ప్రస్తుతం ఈయన నటించిన 'హైవే' విడుదలకు సిద్ధంగా ఉంది. '118', 'చిచిచి' వంటి వినూత్న చిత్రాలను తెరకెక్కించిన కే.వి గుహన్ ఈ సినిమాను తెరకెక్కించాడు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆగస్టు 19 నుండి నేరుగా ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. లేటెస్ట్‌గా విడుదలైన టీజర్ ఆద్యాంతం ఆసక్తి రేకెత్తిస్తుంది. '5 హత్యలు, ఎలాంటి అధారాలు లేవు. ఆ అమ్మాయిలపై వాళ్ళకు ఎందుకుంత కోపం' అంటూ వచ్చే డైలాగ్ సినిమాపై విపరీతమైన క్యూరియాసిటీ పెరుగుతుంది. సిమోన్ కింగ్ నేపథ్య సంగీతం థ్రిల్ ఫీల్‌ను కలిగిస్తుంది. కెమెరా విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో సత్య, అభిషేక్ బెనర్జీ, సైయామీ ఖేర్ కీలకపాత్రల్లో నటించారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ పతాకంపై వెంకట్ తలారి ఈ చిత్రాన్ని నిర్మించాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in